www.pencounter.net

# పెన్ కౌంటర్

అవినీతి పై అక్షర సమరం..!

హైదరాబాద్
12-8-2025
వెల: రూ.5/-
పేజీలు: 4
సంపుటి:01
సంచిక: 43

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## కోర్టును మరింత సమయం కోరదామా?

- బీసీ రిజర్వేషన్లపై పార్టీ పరంగా 42% ప్రకటించి ముందుకెళ్దామా?
- రేవంత్‌రెడ్డి, మహేశ్‌గౌడ్ భేటీలో చర్చ
- రాజకీయ వ్యవహారాల కమిటీలో నిర్ణయం
- వారం రోజుల్లో నామినేటెడ్ పదవుల భర్తీ!
- 23 నుంచి ప్రజాపథం పునఃప్రారంభం
- ముఖ్యమంత్రి పాల్గొనే అవకాశం!

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు రిజర్వేషన్లపై ముందుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నిర్ణయించారు. ఈ నెల 16 లేదా 17న పీఏసీ సమావేశాన్ని నిర్వహించాలని భావిస్తున్నారు. మహేశ్‌గౌడ్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు.

2లో

# ఓట్ల చోరీపై పోరుబాట

- ఓట్ల చోరీ, ఎస్ఐఆర్‌పై 300 మంది ఎంపీల నిరసన
- పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయానికి..
- ఇండియా కూటమి ఎంపీల భారీ నిరసన ప్రదర్శన
- ర్యాలీలో పాల్గొన్న లోక్‌సభ, రాజ్యసభ విపక్ష ఎంపీలు
- మధ్యలోనే అడ్డుకుని నిర్బంధించిన ఢిల్లీ పోలీసులు
- బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపిన మహిళా ఎంపీలు
- పోలీసులతో వాగ్వాదం.. తోపులాట.. తీవ్ర ఉద్రిక్తత
- రాహుల్, ఖర్గే, ప్రియాంక సహా పలువురు నేతల అరెస్టు

న్యూఢిల్లీ,:ఎన్నికల కమిషన్ తీరును నిరసిస్తూ ఢిల్లీలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు కదం తొక్కారు. బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ పేరుతో భారీగా ఓట్లను తొలగిస్తున్నారని, దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపిస్తూ.. సోమవారం నిరసన చేపట్టారు. పార్లమెంట్ భవనం నుంచి ఈసీ కార్యాలయం దాకా ఎంపీలు ప్రదర్శన చేపట్టగా.. వారిని ఢిల్లీ పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకొని నిర్బంధించారు. ఈ క్రమంలో పోలీసులు, ఎంపీల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.







## నేడే పార్లమెంట్ నిరవధిక వాయిదా

వారం ముందుగానే వాయిదాకు కేంద్రం నిర్ణయం!

ప్రతిపక్షాల నిరసనలతో ఆత్మరక్షణలో ప్రభుత్వం



2లో

## మోదీ ఓట్ల దొంగ కాబట్టే మౌనంగా ఉన్నారు

- ఓట్ చోర్ క్యాంపెయిన్ ను ప్రతి ఇంటికి చేరుస్తామన్న షర్మిల
- నకిలీ ఓటర్ల జాబితా ఎందుకు తారుమారయిందని ప్రశ్న
- బీజేపీ చేతిలో ఈసీ కీలుబొమ్మగా మారిందని విమర్శ

# ఆర్థిక వ్యవస్థను ఖతం పట్టించారు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్
- రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని విమర్శ
- రైతు బీమా గతంలో మాదిరిగా రెన్యువల్ చేయాలని డిమాండ్



2లో

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనలో తెలంగాణ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలు సంగతేమో కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మాత్రం గ్యా రెంటీగా ఖతం పట్టించిందని అన్నారు. కాగ్ ఇచ్చిన తాజా నివేదికలోని అంశాలను ప్రస్తావిస్తూ.. రేవంత్‌రెడ్డి ముఖ్య మంత్రి అయ్యాక తెలంగాణ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజా రిందని సోమవారం ఒక ప్రకటనలో కేటీఆర్ పేర్కొన్నారు.

**ఇప్పటికే రూ.20,266 కోట్లు అప్పు**

'కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తలకిందులైంది. కాగ్ నివేదిక ప్రకారం, రాష్ట్ర ఆదాయం పడిపోవడంతో పాటు అప్పులు భారీగా పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ. 20,266 కోట్లు ప్రభు త్వం అప్పుగా

# సరుకు రవాణా మార్గాలకు కేంద్రంగా రాష్ట్రం

- రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల కార్గో నిర్వహణా చేపట్టాలి: చంద్రబాబు
- ఎకనమిక్ హబ్‌గా రేవులు, ఎయిర్‌పోర్టులు
- శాటిలైట్ టౌన్‌షిప్పుల అభివృద్ధి జరగాలి
- సమీకృత పురోగతికి బ్లూ ప్రింట్
- షిప్ బిల్డింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు
- పరిశ్రమలు, మౌలిక వసతులపై సీఎం సమీక్ష

2లో



అమరావతి ఆంధ్రప్రదేశ్‌తో పాటు పొరుగు రాష్ట్రాల సరుకును కూడా రవాణా చేసేందుకు లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఓడరేవులు, విమానాశ్రయాలు, రహదారులు, రైలు, అంతర్గత జల రవాణా మార్గాల ద్వారా చేపట్టే సరుకు రవాణాను ఈ కార్పొరేషన్ ద్వారా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలు, మౌలిక సదుపాయాలపై ఆయన సమీక్ష జరిపారు.

## స్పీకర్‌పై ఒత్తిడి పెంచాలి: కేసీఆర్

- ఎమ్మెల్సీల ఫిరాయింపుపై త్వరలో పిటిషన్ వేయాలి
- బీఆర్ఎస్ ముఖ్య నేతలకు కేసీఆర్ ఆదేశం
- బీసీ రిజర్వేషన్ల పెంపుపై సర్కారు చేతులెత్తేసిందని వ్యాఖ్య
- 14న బీసీల కదన భేరి ఏర్పాట్లపైనా చర్చ

హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో అసెంబ్లీ స్పీకర్‌పై ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు పార్టీ ముఖ్య నేతలను ఆదేశించారు. మరోవైపు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్సీలపై సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు జరుగుతున్న సన్నద్ధతపై ఆరా తీశారు.



## త్వరలో నూతన ఫిల్మ్ పాలసీ

- ఈ ఏడాది నంది అవార్డుల ప్రదానం
- సినీ నిర్మాతల భేటీలో మంత్రి దుర్గేశ్ వెల్లడి
- పరిశ్రమకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని హామీ
- అధ్యయనం చేసి సరైన ప్రతిపాదనలతో రావాలని సూచన

# ఓట్ల చోరీపై పోరుబాట

(మొదటి పేజీ తరువాయి)

కొందరు నేతలు బారికేడ్లు ఎక్కి ముందుకెళ్లే యత్నం చేయడం, పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇద్దరు మహిళా ఎంపీలు కళ్లుతిరిగి పడిపోయారు. ఎంపీల శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని పలువురు నేతలు మండిపడ్డారు. సోమవారం ఉదయం పార్లమెంట్ సమావేశం కాగానే.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను రద్దు చేయాలి.. ఓట్ల చోరీని నిలిపివేయాలి అని నినాదాలు చేస్తూ ప్రతిపక్ష సభ్యులు ఉభయ సభలను స్తంభింపజేశారు. దీంతో సభలు వాయిదా పడ్డాయి. అనంతరం ఉభయ సభలకు చెందిన దాదాపు 300 మంది ఇండియా కూటమి ఎంపీలు అక్కడి నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయానికి ప్రదర్శనగా బయలుదేరారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, ఎంపీ ప్రియాంకగాంధీ, సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్, ఎన్సీపీ–ఎస్పీ నేత శరద్‌పవార్, శివసేన నేతలు సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది, డీఎంకే నేత టీఆర్ బాలు, తృణమూల్ నేత డెరెక్ ఒబ్రెయిన్ సహా ఆర్జేడీ, లెఫ్ట్, ఆప్ నేతలు సైతం ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కై బీజేపీని గెలిపిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ మకర ద్వారం నుంచి బయలుదేరి ప్రదర్శనగా వెళుతుండగా.. పోలీసులు అడుగడుగునా బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు. సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మహిళా ఎంపీలు మహువా మొయిత్రా, సంజనా జాదవ్, జ్యోతిమణి, ఎన్సీపీ నేత సుప్రియా సూలే.. బారికేడ్ల పైకెక్కి ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ.. నిరసన జరిగినంతసేపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకగాంధీ వాద్రా, అఖిలేశ్ యాదవ్, సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది సహా పలువురిని పోలీసులు బస్సుల్లోకి ఎక్కించి పార్లమెంట్ వీధిలో ఉన్న పోలీసస్టేషన్‌కు తరలించారు. ఆ తరువాత కొద్దిసేపటికి విడుదల చేశారు. కాగా, 30 మంది ఎంపీలను కలుసుకునేందుకు మాత్రమే ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిందని, కానీ.. 200 మందికి పైగా నేతలు ర్యాలీలో పాల్గొన్నారని డిప్యూటీ పోలీస్ కమిషనర్ దేవేశ్‌కుమార్ మహా తెలిపారు. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు వారిని నిలువరించి నిర్బంధించాల్సి వచ్చిందన్నారు. బారికేడ్లు దాటి ముందుకెళ్లే ప్రయత్నంలో పోలీసులతో ఘర్షణ పడిన తృణమూల్ ఎంపీలు మహువా మొయిత్రా, మిథాలీ బాగ్ స్పృహ తప్పి పడిపోయారు. వారికి రాహుల్‌గాంధీ సాయం అందించడంతో మహువా తేరుకున్నారు. మిథాలీ తేరుకోకపోవడంతో ఆమెను లోహియా ఆస్పత్రికి తరలించారు. తమది రాజకీయ పోరు కాదని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు చేస్తున్న యుద్ధమని రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో ఓట్లను కొల్లగొట్టి బీజేపీకి అనుకూలంగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరుపై తాము పోరాడుతున్నామని చెప్పారు. ఎన్నికల కమిషన్‌తో తాము మాట్లాడలేకపోతున్నామనేది వాస్తవమని, తమకు స్వచ్ఛమైన, నిజమైన ఓటర్ల జాబితా కావాలని డిమాండ్ చేశారు. ఒకే వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్న దానిపై తాము పోరాడుతున్నామని, వాస్తవాలను దేశ ప్రజలకు తెలియజేశామని పేర్కొన్నారు. కాగా, ఓట్ల చోరీపై తాము



శాంతియుతంగా ప్రదర్శన చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు భయపడుతోందో తెలియడం లేదని ఖర్గే అన్నారు. మరోవైపు రాహుల్‌గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ జవాబు ఇవ్వకుండా.. ప్రమాణం చేయడాలనడం విడ్డూరమని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. పోలీసులతో నిర్బంధించడం ద్వారా ప్రతిపక్షాల గొంతు నొక్కలేరని అఖిలేశ్ యాదవ్ అన్నారు.

## కోర్టును మరింత సమయం కోరదామా?

హైదరాబాద్, :స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు రిజర్వేషన్లపై ముందుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నిర్ణయించారు. ఈ నెల 16 లేదా 17న పీఏసీ సమావేశాన్ని నిర్వహించాలని భావిస్తున్నారు. మహేశ్‌గౌడ్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. స్థానిక ఎన్నికలు, నామినేటెడ్ పదవులు, ఇతర అంశాలపై చర్చించారు. స్థానిక ఎన్నికల నిర్వహణకు కోర్టు ఇచ్చిన గడువు ముంచుకొస్తున్న నేపథ్యంలో ఎలా ముందుకువెళ్లాలన్నదానిపై సమాలోచనలు జరిపారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో ఆమోదించిన బిల్లు, పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతూ తెచ్చిన ఆర్డినెన్సు రెండూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశం చర్చకు వచ్చింది. ఈ విషయాన్ని కోర్టుకు నివేదించి.. స్థానిక ఎన్నికల నిర్వహణకు మరికొంత గడువు కోరితే ఎలా ఉంటుందన్న విషయంపై నేతలిద్దరూ చర్చించారు. కోర్టు అనుమతిస్తే కేంద్రంపై మరోమారు ఒత్తిడి కార్యాచరణ చేపట్టవచ్చని భావిస్తున్నారు. అలా కాకుండా స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లుగా ప్రకటించి, ఎన్నికలకు వెళ్లడంపైనా చర్చించారు. పీఏసీ సమావేశం తర్వాతే స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత రానుంది. పార్టీ పరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటించి, ముందుకు వెళ్లాలని పీఏసీలో నిర్ణయం తీసుకుంటే.. సెప్టెంబరు 10 తర్వాత స్థానిక ఎన్నికలు ఉండొచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ లోపు ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించాల్సి ఉంటుంది. పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని సీఎం రేవంత్, మహేశ్‌గౌడ్ నిర్ణయించినట్లు తెలిసింది. జిల్లా, లోక్‌సభ నియోజకవర్గ స్థాయి పరిశీలకులు.. నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించి నియోజకవర్గానికి రెండు పేర్లతో ఇచ్చిన ప్రతిపాదనలు సీఎం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. స్థానిక ఎన్నికలకు ముందే ఈ పోస్టులను భర్తీ చేసి, కార్యకర్తల్లో కదలిక తీసుకురావాలన్న ఆలోచనలో రేవంత్‌రెడ్డి ఉన్నారు. గెలుపే ప్రాతిపదికగా, సర్వేల ఆధారంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని నిర్ణయించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతో కీలకమైన ఈ ఉప ఎన్నికలో అభ్యర్థిపై ఎలాంటి ఒత్తిడికీ తావు లేకుండా.. సర్వేల ఆధారంగానే నిర్ణయానికి రావాలని అనుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీల వారీగా జరిగిన సర్వేలను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని భావిస్తున్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిత్వం కోసం ప్రస్తుతం టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత నవీన్ యాదవ్, రెహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డిలు ప్రధానంగా పోటీ పడుతున్నారు. వీరి అభ్యర్థిత్వాలపై పార్టీసర్వే జరుగుతోంది. ఇదిలా ఉండగా.. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను మంత్రిత్వ శాఖల వారీగా సమీక్షించారు. జనహిత పాదయాత్రల ద్వారా వీటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నేతలిద్దరూ నిర్ణయించారు. ఈ నెల 23 నుంచి పాదయాత్రను పునఃప్రారంభిస్తున్నామని, యాత్రలో ఒక రోజు పాల్గొనాలని సీఎం రేవంత్‌ను మహేశ్‌గౌడ్ కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

## త్వరలో నూతన ఫిల్మ్ పాలసీ


అమరావతి: సోమవారం అమరావతి సచివాలయంలో పలువురు తెలుగు సినీ నిర్మాతలు ఆయనతో భేటీ అయ్యారు. సినిమా రంగ సమస్యలపై రూపొందించిన డాక్యుమెంట్‌ను మంత్రికి అందజేశారు. సినీ పరిశ్రమకు సంబంధించిన 24 విభాగాల అభివృద్ధిపై చర్చించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. వారిద్దరి అపాయింట్‌మెంట్లు ఇప్పించాలని కోరుతూ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, గౌరవ కార్యదర్శి దామోదరప్రసాద్ మంత్రికి విజ్ఞాపన అందజేశారు. రాష్ట్రంలో సినిమా షూటింగులు, కొత్త సినిమాల విడుదల, నూతన ఫిల్మ్ పాలసీ తదితర అంశాలపై నిర్మాతలతో మంత్రి చర్చించారు. సెప్టెంబరు మొదటి పక్షంలో సీఎం, డిప్యూటీ సీఎంతో సమావేశం ఏర్పాటు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలో, చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా అధ్యయనం చేసి, సరైన ప్రతిపాదనలతో రావాలని నిర్మాతలకు సూచించారు. అనంతరం మంత్రి దుర్గేశ్ మీడియాతో మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో స్టూడియోల నిర్మాణం, డబ్బింగ్, రీరికార్డింగ్ థియేటర్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అందిస్తామని చెప్పారు. త్వరలో సినీ రంగ భాగస్వాములతో భేటీ అయ్యి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. నిర్మాతలు ముందుకు రావడం తొలి మెట్టుగా భావిస్తున్నామని, సినీ రంగానికి అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని వివరించారు.

నాటకోత్సవాలు, నంది అవార్డుల విషయంలో సీఎం, డిప్యూటీ సీఎం స్పష్టమైన సూచనలు చేశారని, ఈ ఏడాది తప్పకుండా నంది అవార్డులిస్తామని చెప్పారు. ఆ కార్యక్రమాన్ని ఏ విధంగా నిర్వహిస్తే తెలుగు చిత్ర పరిశ్రమకు ఉపయోగపడుతుందో ఆలోచన చేసి, తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. రెండు రాష్ట్రాలకు తెలుగు సినిమా ఒక్కటేనని చెప్పారు. 'అక్కడ ఉత్తమ చిత్రం.. ఇక్కడా ఉత్తమ చిత్రమే అవుతుంది కదా!' అన్నారు. నంది అవార్డుల ఎంపిక ఇరు రాష్ట్రాలు కలిసి చేయాలా? విడివిడిగా చేయాలా? అనే అంశంపై భిన్నాభిప్రాయాలున్నాయని, సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లి స్పష్టత వచ్చేలా చూస్తామన్నారు. సినిమాల రూపకల్పన, విధి విధానాల విషయంలో బడ్జెట్ ప్రాతిపదికన ఏయే సినిమాలకు ఏ రకంగా సాయం అందించాలన్న అంశంపై నిర్మాతలతో చర్చించినట్లు చెప్పారు.

## సరుకు రవాణా మార్గాలకు కేంద్రంగా రాష్ట్రం

(మొదటి పేజీ తరువాయి)

సరుకు రవాణా మార్గాలకు కేంద్రంగా రాష్ట్రం ఎయిర్‌పోర్టులు–పోర్టుల అభివృద్ధి, మారిటైం పాలసీలో తీసుకురావలసిన మార్పులు, లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్రంలో 20 పోర్టులు, మరిన్ని ఎయిర్‌పోర్టుల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామని సీఎం తెలిపారు. 'ప్రతి రేవు, విమానాశ్రయ సమీప ప్రాంతాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. ఓడరేవులు, విమానాశ్రయాలకు అనుసంధానించేలా శాటిలైట్ టౌన్‌షిప్పులను అభివృద్ధి చేయాలి. దీనివల్ల కొత్తగా మరిన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. తద్వారా సంపద సృష్టి జరుగుతుంది. ఈ తరహా సమీకృత అభివృద్ధి ఎక్కడెక్కడ చేయగలమో.. ఏవిధంగా చేయగలమో బ్లూ ప్రింట్ సిద్ధం చేసుకోవాలి. ఇదే సమయంలో సరుకు రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలి. రోడ్డు, రైలు, ఎయిర్‌కార్గో, ఇన్‌ల్యాండ్, మారిటైం కార్గోలకు మన రాష్ట్రమే కేంద్రంగా ఉండాలి. తక్కువ వ్యయమయ్యే మార్గం ద్వారా సరుకులను రవాణా చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఉత్తర–దక్షిణాది రాష్ట్రాలకు వెళ్లాలంటే మన రాష్ట్రమే కేంద్రం. ఇలాంటి పరిస్థితుల్లో మన వద్ద అన్ని రకాల సరుకు రవాణా మార్గాలు అందుబాటులో ఉంటే.. అభివృద్ధి వేగంగా జరుగుతుంది. పోర్టులు, ఎయిర్‌పోర్టులకు అనుసంధానంగా నేషనల్ హైవే కనెక్టివిటీ, రైల్ కనెక్టివిటీ



ఉండేలా చూసుకోవాలి. కేంద్రం వద్ద నేషనల్ హైవేలకు, రైల్వే మార్గాలకు నిధుల కొరత లేదు. మనం ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రతిపాదనలు పంపితే ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉంది. దీనిని మనం సద్వినియోగం చేసుకోవాలి' అని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో వివిధ మార్గాల ద్వారా చేపట్టే సరకు రవాణాను సమర్థంగా నిర్వహించేందుకు లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు. ఇది గ్రోత్ ఇంజన్ మాదిరిగా ఉండాలని తెలిపారు. పోర్టులు, ఎయిర్‌పోర్టుల సమీపంలో శాటిలైట్ టౌన్ షిప్పుల అభివృద్ధికి సంస్థలను గుర్తించి పీపీపీ విధానంలో చేపట్టాలని సూచించారు. ఇదే తరహాలో 175 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసుకుంటున్న ఎంఎస్ఎంఈ పార్కుల వద్ద కూడా శాటిలైట్ టౌన్‌షిప్పులను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు చేయాలి. కుప్పం, దగదర్తి విమానాశ్రయాల పనులను వేగవంతం చేయాలి' అని చెప్పారు. పెట్టుబడులను మరింతగా ఆకర్షించేందుకు వీలుగా మారిటైం విధానంలో మార్పులు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. పోర్టులు, టెర్మినల్స్, షిప్ బిల్డింగ్ యూనిట్లు, అంతర్గత జల రవాణా మార్గాలు, క్రూయిజ్ టెర్మినళ్ల ఏర్పాటుకు మార్గం సుగమం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం అమలు చేస్తున్న షిప్ బిల్డింగ్ క్లస్టర్ స్కీం పాలసీలో మార్పులు చేసుకోవాలని అధికారులు చెప్పారు. ఇందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. మచిలీపట్నం, మూలపేట, చినగంజాం వంటి ప్రాంతాల్లో షిప్ బిల్డింగ్ యూనిట్ల ఏర్పాటుకు కొన్ని సంస్థలు ముందుకొచ్చాయని అధికారులు తెలిపారు. దీనిపై సీఎం స్పందించారు. 'షిప్ బిల్డింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఎక్కడ అనువుగా ఉందో చూడాలి. స్థానిక మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా చూడాలి. కంటైనర్ పోర్టుల ఏర్పాటు, అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలి' అని స్పష్టం చేశారు.

## ఆర్థిక వ్యవస్థను ఖతం పట్టించారు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంది. వార్షిక ల క్ష్యంలో ఇది 37.5 శాతం. కొత్తగా ఏ రోడ్లు వేయకుండా, ఒక్క ప్రాజెక్టు కూడా ప్రారంభించకుండా, విద్యార్థులకు కనీసం మంచి భోజనమైనా పెట్టకుండా ఈ నిధులను ఏం చేస్తున్నారు? పన్నేతర ఆదా యం కూడా దారుణంగా పడిపోయింది. బడ్జెట్‌లో అంచనా వేసిన దానిలో కేవలం 3.37 శాతం మాత్రమే వసూలు అ యింది. మిగులు బడ్జెట్‌తో ప్రారంభమైన తెలంగాణ, ఇప్పు డు రూ.10,583 కోట్ల రెవెన్యూ లోటును ఎదుర్కోవడం అసమర్థ పాలనకు నిదర్శనం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడి లో పెట్టడానికి ప్రభుత్వం దగ్గర ఎలాంటి ప్రణాళిక ఉందో ప్రజలకు స్పష్టంగా చెప్పాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో పథకాల కోసం ప్రజలు పదే పదే దరఖాస్తు చేసుకోవడానికే సరిపోతుందని, ఒక్క పథకమూ నిర్దిష్టంగా అమలు కావడం లేదని కేటీఆర్ విమర్శించారు. తిక్కలోడు తిరునాళ్లకు పోతే..ఎక్కా దిగా సరిపోయిందన్న చందంగా ప్రభుత్వం తీరుందని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన ఎద్దేవా చేశారు. 'గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు బీమా పథకం కింద 2018 నుంచి 2023 డిసెంబర్ వరకు 1,11,320 మంది రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.5,566 కోట్ల పరిహారం అందించాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బీమా ప్రీమియం చెల్లించలేదు. వేలాదిమంది రైతు కుటుంబాలు బీమా సాయం కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రతి ఏటా ఆగస్టు 14తో రైతుబీమా ప్రీమియం గడువు ముగుస్తుంది. ప్రభుత్వం ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించి రెన్యువల్ చేయడం ఆనవాయితీ. అయితే గడువు దగ్గరకు వచ్చిన తర్వాత రైతుబీమా కోసం రైతు స్వయంగా స్వీయ ధ్రువీకరణ (సెల్ఫ్ డిక్లరేషన్) పత్రం అందజేయాలని, తనతో పాటు నామినీ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు కూడా అందజేయాలనే నిబంధన విధించారు. ప్రస్తుతం ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి కీలక సమయంలో రైతుబీమాకు రైతులు మళ్లీ దరఖాస్తు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం మూర?త్వం. గతంలో మాదిరిగానే ప్రభుత్వం రైతు బీమా రెన్యువల్ చేయాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## నేడే పార్లమెంట్ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ, :పార్లమెంటు ఉభయ సభలను మంగళవారం నిరవధికంగా వాయిదా వేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వర్షాకాల సమావేశాలను ఈ నెల 21 వరకు కొనసాగించాలని కేంద్రం ముందుగా నిర్ణయించినా.. వారం రోజుల ముందే వాయిదా వేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (ఎస్ఐఆర్), దేశవ్యాప్తంగా ఓట్ల చోరీపై ప్రతిపక్షాల నిరసన ఉధృతం కావడం, గత మూడు వారాలుగా ఉభయ సభలు స్తంభించిపోవడంతో ఆత్మరక్షణలో పడిన కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సోమవారం ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యులు గందరగోళం సృష్టించి ఎన్నికల కమిషన్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లడంతో.. కీలకమైన బిల్లులను ఎన్డీయే భాగస్వామ్య పార్టీల మద్దతుతో ఆమోదించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అత్యంత కీలకమైన జాతీయ క్రీడా పాలనా బిల్లు, జాతీయ యాంటీ డోపింగ్ (సవరణ) బిల్లు, ఆదాయ పన్ను బిల్లు వంటి వాటిని లోక్‌సభ ఆమోదించింది. మరోవైపు రాజ్యసభలో మర్చంట్ షిప్పింగ్ బిల్లు, గోవాలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్టీ ప్రాతినిధ్యాన్ని సవరించే బిల్లును ఆమోదించారు. కాగా, సమైక్య పింఛన్ పథకం చందాదారులకు పన్ను మినహాయింపులు కల్పిస్తూ పన్ను చట్టాలను, ముఖ్యంగా ఆదాయ పన్ను బిల్లును సవరిస్తూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బిల్లును ప్రవేశ పెట్టారు. దీనిపై కొంతసేపు చర్చ జరిగిన అనంతరం సభను వాయిదా వేశారు. ఇక జాతీయ క్రీడాపాలనా బిల్లు, యాంటీ డోపింగ్ సవరణ బిల్లును మధ్యాహ్నం 2గంటల తర్వాత వరుసగా ఈ బిల్లులను ప్రవేశపెడుతూ.. ఒకదాని తర్వాత మరొకటి ఆమోదిస్తూ వచ్చారు.

## స్పీకర్‌పై ఒత్తిడి పెంచాలి: కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో న్యాయవాదులు కోరిన విధంగా పూర్తి సమాచారాన్ని వీలైనంత త్వరగా సిద్ధం చేసి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని కేటీఆర్‌ను ఆదేశించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కేసీఆర్ సోమవారం ఎర్రవల్లి నివాసంలో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై ఆయన చర్చించినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర ప్రభుత్వ స్థానిక ఎన్నికల సన్నద్ధతపై చర్చించడంతో పాటు బీసీ రిజర్వేషన్ల పెంపుదలకు సంబంధించిన పరిణామాలు భేటీలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంలో ప్రభుత్వం ఇప్పటికే చేతులెత్తేసిందని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. పార్టీ పరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే అవకాశముందని సమావేశంలో నేతలు అంచనా వేశారు. ఈ నెల 14న కరీంనగర్ వేదికగా బీఆర్ఎస్ నిర్వహించే 'బీసీల కదన భేరి' సభ ఏర్పాట్లపైనా చర్చించారు. సభలో రిజర్వేషన్ల అంశాన్ని బలంగా ప్రస్తావించి కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టాలని కేసీఆర్ ఆదేశించారు. ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్టుపై ఇటీవల ఢిల్లీలో న్యాయ నిపుణులతో హరీశ్ జరిపిన సంప్రదింపులకు సంబంధించి చర్చ జరిగినట్లు తెలిసింది. జాతీయ స్థాయిలో ఏపీ సీఎం చంద్రబాబు వేస్తున్న ఎత్తుగడలకు పార్టీ పరంగా చెక్ పెట్టేలా ఎలాంటి వ్యూహం అనుసరించాలనే అంశంపై కేసీఆర్ దిశా నిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటనకు ముందే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని కేసీఆర్ అభిప్రాయపడినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెడితే అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్లు తెలిసింది. దీనిపై చర్చకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని కేసీఆర్ వెల్లడించినట్లు సమాచారం. 'ఉద్యమ పార్టీగా ప్రస్థానం ప్రారంభించి పదేళ్లు అధికారంలో కొనసాగి, ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతర పోరాటం చేస్తోంది. కానీ బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతోందని కొందరు ఉద్దేశపూర్వక ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో కేడర్‌కు తప్పుడు సంకేతాలు వెళ్లక ముందే విలీనం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టండి..' అని బీఆర్ఎస్ అధినేత ఆదేశించారు.

## మోదీ ఓట్ల దొంగ కాబట్టే మౌనంగా ఉన్నారు

బీజేపీ, ఈసీకి వ్యతిరేకంగా'ఓట్ చోర్ క్యాంపెయిన్'ను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఏపీలో సైతం ఈ కార్యక్రమాన్ని ప్రతి గడపకు చేరుస్తామని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తెలిపారు. ఓట్ల దొంగ మోదీ తీరును, బీజేపీ కోసం అధికార దుర్వినియోగం చేసిన ఎన్నికల కమిషన్ వైఖరిని ఎండగడతామని చెప్పారు. ప్రజాస్వామ్యమే ఈసీకి ముఖ్యమని భావిస్తే... రాహుల్ గాంధీ లేవనెత్తిన సందేహాలకు బదులివ్వాలని డిమాండ్ చేశారు. నకిలీ ఓటర్ల జాబితా ఎందుకు తారుమారయిందని షర్మిల ప్రశ్నించారు. డిజిటల్ ఓటర్ జాబితాను ఎందుకు ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలను ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీకి ఎన్నికల సంఘం ఏజెంట్ గా మారిందా? అని నిలదీశారు. దొడ్డిదారిలో గెలుపు కోసం ఎన్నికల కమిషన్ నే బీజేపీ కలుషితం చేసిందని షర్మిల మండిపడ్డారు. స్వతంత్ర వ్యవస్థ అయిన ఈసీ బీజేపీ చేతిలో కీలుబొమ్మగా మారిందని, ఆర్ఎస్ఎస్ లాంటి అనుబంధ సంస్థల జాబితాలో చేరిందని విమర్శించారు.




## ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను విజయవంతం చేయండి....

**ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు.....**

దేవరకొండ టౌన్ ఆగస్టు 11 పెన్ కౌంటర్ ప్రతినిధి: ఈనెల ఆగస్టు 12 నుంచి 31వ తేది వరకు జరిగే ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు పిలుపునిచ్చారు.సోమవారం దేవరకొండ లోని పల్లా పర్వత్ రెడ్డి భవన్ లో జరిగిన ఏఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ ముఖ్య నాయకుల సమావేశానికి. హాజరైన ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు మాట్లాడుతూ... దేశంలో స్వాతంత్రం రాక ముందు దేశ స్వాతంత్రమే లక్ష్యంగా 1936 ఆగస్టు 12న ఉత్తర ప్రదేశ్ లోని లక్నో నగరంలో ఏర్పడిన మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఏఐఎస్ఎఫ్ చరిత్రలో నిలిచిందని, దేశ స్వాతంత్ర పోరాటంలో ఎంతో మంది యువ కిషోరాలను బలిదానం చేసిన ఏకైక విద్యార్థి సంఘమని, నాటి నుంచి నేటి వరకు దేశ సమగ్రతపై, ప్రభుత్వ విద్య పరిరక్షణకై, విద్యారంగ సమస్యలపై సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తున్న సంఘం ఎఐఎస్ఎఫ్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావించి 90 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఈనెల ఆగస్టు 12 తేది నుంచి 30వ తేది వరకు ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వార్షికోత్సవాలను విద్యార్థులు, అభ్యుదయవాదులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వట్టేపు శివకుమార్, సహాయ కార్యదర్శి ఎనమల సాయి, డివిజన్ సమితి సభ్యులు దాసరి శివ, కె భాను, ఎస్ వినయ్, పి మధు,ఎం అరవింద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జపాన్‌లో లాగే నాకూ రిటైర్మెంట్ ఉండదు: మల్లారెడ్డి

**రాజకీయాల నుంచి వైదొలగుతున్నానన్న వార్తలను ఖండించిన మల్లారెడ్డి**

**తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని, పార్టీ మారేది లేదని వెల్లడి**

**బీజేపీ, టీడీపీలో చేరుతున్నట్టు వస్తున్న ప్రచారంలో నిజం లేదన్న మాజీ మంత్రి**

**దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు విస్తరిస్తానన్న వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరణ**

తన రాజకీయ భవిష్యత్తుపై కొనసాగుతున్న ఊహాగానాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి ఒక్క ప్రకటనతో తెరదించారు. రాజకీయాల నుంచి తాను తప్పుకోవడం లేదని, చివరి వరకు క్రియాశీల రాజకీయాల్లోనే కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు. "జపాన్‌లో ప్రజలకు ఏ విధంగా అయితే రిటైర్మెంట్ ఉండదో, నాకు కూడా రాజకీయాల్లో రిటైర్మెంట్ లేదు" అంటూ ఆయన ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు.తనకు ఇప్పుడు 73 ఏళ్లని, ఇంక రాజకీయమే వద్దనుకుంటున్నానని మల్లారెడ్డి నిన్న వ్యాఖ్యానించాడం చర్చనీయాంశంగా మారింది. ముమ్మందు పూర్తిస్థాయిలో తన విద్యా సంస్థల విస్తరణపై దృష్టి కేంద్రీకరిస్తానని అన్నారు. అయితే ఇవాళ ఆయన తన వ్యాఖ్యలపై క్లారిటీ ఇచ్చారు. తాజాగా ఓ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ఎప్పుడూ చెప్పలేదని ఆయన తెలిపారు. "నేను నా విద్యాసంస్థలను దేశవ్యాప్తంగా విస్తరిస్తానని చెప్పాను. అంతేకానీ, రాజకీయాలను వదిలేస్తానని అనలేదు. నా మాటలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారు" అని ఆయన వివరించారు. తన వ్యాపార ప్రణాళికలను రాజకీయాలకు ముడిపెట్టవద్దని ఆయన సూచించారు.అదే సమయంలో, పార్టీ మార్పుపై వస్తున్న వదంతులను కూడా ఆయన తీవ్రంగా ఖండించారు. తాను బీజేపీ లేదా టీడీపీలోకి వెళ్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని తేల్చిచెప్పారు. "నేను బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు. ఇదే పార్టీలో కొనసాగుతాను" అని ఆయన పునరుద్ఘాటించారు. ఈ ప్రకటనతో తన రాజకీయ ప్రస్థానంపై నెలకొన్న అన్ని అనుమానాలకు మల్లారెడ్డి ముగింపు పలికినట్లయింది.

## ఆమెకు 30.. అతనికి 19!

**జూన్‌లో ప్రేమ వివాహం ...భర్త వేధింపులతో ఆత్మహత్య**

కాటారం: ఆమె వయసు 30.. అతని వయసు 19. ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. ఇంతలోనే భర్తతో పాటు అతని కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం అంగరాజ్‌పల్లికి చెందిన దుర్గం సరళ(30).. అదే గ్రామానికి చెందిన 19 ఏళ్ల జాడి రాజేశ్ గత జూన్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. బతుకుతెరువు నిమిత్తం కాటారం మండల కేంద్రానికి వచ్చి ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. రాజేశ్ కుటుంబ సభ్యులకు ఈ వివాహం ఇష్టం లేదు. ఈక్రమంలో రాజేశ్‌ను కుటుంబ సభ్యులు ఉసిగొల్పడంతో.. సరళను హింసించడం మొదలుపెట్టాడు. భర్త వేధింపులు తట్టుకోలేక సరళ శనివారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# పైపైకి పాతాళ గంగ..

### మేలో 10.07 మీటర్లు.. జూన్‌లో 9.47 మీటర్ల సగటు లోతుల్లో భూగర్భ జలాలు

### జూలైలో 8.37 మీటర్ల వద్దే జలాలు.. భారీ వర్షాలతో పెరుగుతున్న నీటిమట్టం

### హైదరాబాద్ జిల్లాలో 2.71 మీటర్ల వృద్ధి



హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాలకు భూగర్భ జలమట్టాలు గణనీయంగా వృద్ధిచెందాయి. భూగర్భ జలాల సగటు లోతు గత మేలో 10.07 మీటర్లకు పడిపోగా, వర్షాలు ప్రారంభం కావడంతో జూన్‌లో 9.47 మీటర్లకు.. జూలైలో 8.37 మీటర్లకు పెరిగాయి. మేతో పోలిస్తే జూన్‌లో భూగర్భ జలమట్టాల సగటు 0.6 మీటర్లు, జూలైలో 1.69 మీటర్ల మేర వృద్ధి చెందినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, 2024 జూలైతో పోలిస్తే 2025 జూలైలో మాత్రం 0.13 మీటర్ల మేర భూగర్భ జలాలు తగ్గిపోయాయి. 2024 జూలైలో రాష్ట్ర భూగర్భజలాల సగటు నీటిమట్టం 8.25 మీటర్లు మాత్రమే కావడం గమనార్హం. రాష్ట్ర భూగర్భ జలవనరుల శాఖ జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో భూగర్భ జలాల స్థితిగతులను పరిశీలించి తాజాగా రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది. భూగర్భ జలవనరుల శాఖ రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసిన 1,771 పీజోమీటర్ల ద్వారా భూగర్భ జలాల స్థితిగతులను ప్రతి నెలా సమీక్షించి, తర్వాతి నెలలో నివేదికలను విడుదల చేస్తూ ఉంటుంది. మెదక్ జిల్లాలో 14.16 మీటర్ల లోతుకు..

ఈ సీజన్‌లో కృష్ణానది పరీవాహకంలో విస్తారంగా వర్షాలు కురవడంతో జలవనరుల్లో పుష్కలంగా నీరు చేరింది. దీంతో పరీవాహకం పరిధిలోని ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా వృద్ధి చెందాయి. మరోవైపు గోదావరి పరీవాహకంలో వర్షాభావం నెలకొని ఉండటంతో అక్కడి కొన్ని జిల్లాల్లో భూగర్భ జలాలు జూన్‌తో పోలిస్తే జూలైలో మరింతగా దిగజారాయి. గోదావరి పరీవాహక పరిధిలోని మెదక్ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా 14.16 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. కాగా, ఖమ్మం జిల్లాలో 3.87 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని జిల్లాలను సగటు భూగర్భ జలమట్టం 0%-%5 మీటర్లు, 5%-%10 మీటర్లు, 10 మీటర్లపైన లోతు.. అనే మూడు కేటగిరీలుగా వర్గీకరిస్తారు. భూగర్భ జలాలు 0%-% 5 మీటర్లలోపు లోతులో ఉంటే సురక్షిత స్థాయిలో ఉన్నట్టు భావిస్తారు. రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలుండగా, 4 జిల్లాల్లో 0%-%5 మీటర్ల లోతులోనే భూగర్భ జలమట్టం ఉందని గుర్తించారు. 19 జిల్లాల్లో 5%-%10 మీటర్ల లోతులో, 10 జిల్లాల్లో 10%-%15 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నట్టు తేలింది. 10 మీటర్లకన్నా లోతుకు భూగర్భ జలాలు పడిపోయిన జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టుగా భావిస్తారు.

**సాధారణంతో పోలిస్తే వర్షపాతం తక్కువే..**

జూలైలో రాష్ట్ర వార్షిక సగటు వర్షపాతం 358 మి.మీ.లు కాగా, 2025 జూన్‌లో 342 మి.మీ.ల సగటు వర్షపాతమే నమోదైంది. అంటే సాధారణం కంటే 4 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని స్పష్టమవుతోంది.

**హైదరాబాద్‌లో భారీగా వృద్ధి..**

హైదరాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో భారీగా భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. 2024 జూన్‌తో పోలిస్తే 2025 జూన్‌లో రాష్ట్రంలోని 15 జిల్లాల్లో భూగర్భ జలమట్టాల్లో వృద్ధి నమోదు కాగా, మరో 18 జిల్లాల్లో క్షీణత కనిపించింది. గత ఏడాది జూలైలో రాష్ట్ర సగటు భూగర్భ జలాల లోతు 8.25 మీటర్లుకాగా.. ఈ ఏడాది జూలైలో 8.37 మీటర్లుగా నమోదైంది. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 2.71 మీటర్లు, అత్యల్పంగా మెదక్ జిల్లాలో 0.03 మీటర్ల వృద్ధి నమోదైంది.



## సివిల్స్ అభ్యర్థులకు ఎంతైనా సహకరిస్తాం

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**సింగరేణి తోడ్పాటుతో 178 మంది సివిల్స్ అభ్యర్థులకు రూ. లక్ష చొప్పున చెక్కుల అందజేత**

హైదరాబాద్: సివిల్స్ సాధించాలనుకునే అభ్యర్థులకు ఎంతయినా సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. సివిల్స్‌లో తెలంగాణ విద్యార్థులే అత్యధికంగా ఎంపిక అవ్వాలని ఆయన అన్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 'రాజీవ్ సివిల్స్ అభయ హస్తం'పథకం పేరుతో సివిల్స్ మెయిన్స్‌కు సన్నద్ధమయ్యే 178 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించే చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రజాభవన్‌లో జరిగింది. చెక్కులు అందించిన అనంతరం భట్టి మాట్లాడారు. సమాజంలో మానవ వనరులే బలమైన పెట్టుబడులని, వీటిని సానబట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇంటర్వ్యూకి ఎంపికైన వారికి కూడా రూ.లక్ష ఆర్థిక సాయం, ఢిల్లీలో వసతులు కల్పిస్తామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. మొదటి సంవత్సరం 148 మందికి ఆర్థిక తోడ్పాటునిచ్చినట్టు చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో బ్యూరోక్రసీ పాత్ర కీలకమని, ప్రజల జీవన స్థితిగతులను వీరే మార్చగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్రం నుంచి ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపికైతే రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ పథకం సహాయంతో సివిల్స్‌లో విజయం సాధించి, పరిపాలన విభాగంలో అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిత్తల్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ పేదింటి పిల్లలు కూడా సివిల్స్‌లో విజయం సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. 2024లో తెలంగాణ ప్రాంతం నుంచి సివిల్స్ విజేతలైన 30 మందికి ఈ సందర్భంగా మెమెంటోలను బహూకరించారు. వరంగల్‌కు చెందిన ఎట్టబోయిన సాయిశివాని సివిల్స్‌లో 11వ ర్యాంక్ సాధించడంపై ముఖ్యఅతిథులు అభినందనలు తెలిపారు.

## మహా నగరాన్ని వదలని వరుణుడు



హైదరాబాద్: మహా నగరాన్ని వరుణుడు పగబట్టినట్లే ఉన్నాడు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరం అతలాకుతలమవుతోంది. చినుకు చినుకుగా మొదలైన వాన.. భారీ వర్షంగా మారడంతో నగర వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాసేపు విరామం ఇచ్చి హమ్మయ్యా అనుకునేలోపే మళ్లీ నగరంలోని ఏదో మూలన భారీ వర్షం మొదలవుతోంది. శనివారం(ఆగస్టు 9వ తేదీ) రాత్రి సమయంలో నగరాన్ని భారీ వర్షం ముంచెత్తగా, (ఆగస్టు 11వ తేదీ) మధ్యాహ్నా సమయానికే మళ్లీ భారీ వర్షం మొదలైంది. ఉప్పల్, రామాంతపూర్, బోడుప్పల్‌లో భారీ వర్షం కురుస్తోంది. పీర్జాదిగూడ, మేడిపల్లి సహా పలు చోట్లు భారీ వర్షం పడుతోంది. భారీ వర్షం కారణంగా ఉప్పల్‌లో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

గచ్చిబౌలి: అదుపు తప్పి కారు పల్టీ కొట్టడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం పాలైన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన మేరకు.. చత్తీస్‌ఘడ్ రాయపూర్‌కు చెందిన రూపక్ త్రిపాఠి(30) మాదాపూర్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. కేపీహెచ్‌బీలో తమ్ముడు శాశ్వత్ త్రిపాఠితో కలిసి నివాసం ఉంటున్నారు. స్నేహితులతో కలిసి ఎర్టిగా కారులో కేపీహెచ్‌బీ నుంచి నాలెడ్జ్ సిటీకి వెళుతుండా టీ హబ్ రోడ్డులో శనివారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. నాలుగు పల్టీలు కొట్టడంతో బెలూన్ తెరుచుకున్నప్పటికీ డ్రైవింగ్ చేస్తున్న రూపక్ త్రిపాఠి తలకు తీవ్ర గాయాలయ్యాయి. మాదాపూర్‌లోని మెడికొవర్ హస్పిటల్‌లో చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందాడు. కారులో ఉన్న సోదరునితో పాటు స్నేహితులు వైభవ్ పాటిల్, ఇషాన్ త్రిపాఠి, ఎస్ రాజ్ సింగ్‌లు క్షేమంగా బయటపడ్డారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే ఇటీవల రూపక్ త్రిపాఠి మొబైల్ యాప్‌ను డెవలప్ చేశాడు. యాప్‌ను లాంచ్ చేయాల్సి ఉందని చెప్పి చత్తీస్‌ఘడ్ నుంచి వారం రోజుల క్రితం ముగ్గురు స్నేహితులను పిలిపించుకున్నాడు. తెల్లవారు జామున ఐటీ కారిడార్ చూసేందుకు వెళుతూ కారు అదుపుతప్పడంతో రూపక్ త్రిపాఠి తిరిగి రాని లోకాలు వెళ్లాడు.కారు ముందు చక్రం ఊడిపోయి నుజ్జునుజ్జు అయ్యింది. పోలీసులు మృత దేహనికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## కైనెటిక్ ఫ్యామిలీ ఈ-స్కూటర్.. త్వరలో లాంచ్

దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ భారీగా పెరుగుతోంది. ఈ తరుణంలో పూణే ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ కైనెటిక్ గ్రీన్ ఏడాదిన్నరలో ఫామిలీ ఈ-స్కూటర్‌ను మార్కెట్‌లోకి తేనున్నట్టు ప్రకటించింది. 2025 మార్చిలోగా ఎల్5 విభాగంలో ప్యాసింజర్ త్రీ-వీలర్‌ను ప్రవేశపెట్టనున్నట్టు తెలిపింది. 2030 నాటికి రూ.10,000 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా చేసుకున్నట్టు సంస్థ ఫౌండర్, సీఈవో సులజ్జ ఫిరోదియా మోత్వానీ వెల్లడించారు. ఇందులో 60 శాతం ద్విచక్ర వాహన విభాగం, 35 శాతం త్రిచక్ర వాహనాల నుంచి సమకూరాలన్నది ఆలోచనగా చెప్పారు.మోటార్‌సైకిల్స్ విభాగంలోకి ఎంట్రీ ఇవ్వబోమని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహన విభాగంలో ఈ%-%స్కూటర్స్, ఈ%-%లూనాకు పరిమితం అవుతామని తెలిపారు. కైనెటిక్ గ్రీన్ గత నెలలో గ్రేటర్ పసిఫిక్ క్యాపిటల్ (జీపీసీ) నుంచి 25 మిలియన్ డాలర్ల పెట్టుబడి అందుకుంది. ఎలక్ట్రిక్ టూ, త్రీ వీలర్ల వ్యాపార విస్తరణకు ఈ నిధులకు కంపెనీ ఖర్చు చేయనుంది.లంబోర్గ్గిని భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన ప్రీమియం గోల్ఫ్ కార్ట్ శ్రేణి ద్వారా విదేశాల్లో విస్తరించాలని సంస్థ నిర్ణయించింది. సిరీస్%-%ఏ నిధుల సమీకరణలో భాగంగా మరో 15 మిలియన్ డాలర్లను ఈ ఏడాది డిసెంబర్ కల్లా స్వీకరించే అవకాశం ఉందని సులజ్జ వెల్లడించారు. 16 గంటలపాటు కార్యకలాపాలు సాగించే కార్గో ఈ%-%త్రీ వీలర్స్ కోసం అల్ట్రా ఫాస్ట్ చార్జింగ్ సొల్యూషన్‌ను కంపెనీ అభివృద్ధి చేసింది.

## ఎలక్ట్రిక్ సన్‌రూఫ్‌తో అదిరిపోతున్న కొత్త వేరియంట్




హ్యుందాయ్ మోటార్ ఇండియా తమ అప్‌డేట్ చేసిన 'వెన్యూ ఈప్లస్' వేరియంట్‌ను భారత మార్కెట్‌లో విడుదల చేసింది. దీని ధర రూ. 8.23 ??లక్షలతో ప్రారంభమవుతుంది. కొత్త వేరియంట్ జోడింపుతో ఈ లైనప్‌లో 'వెన్యూ ఈప్లస్' మోడల్‌ను ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ ప్యానెల్, అడ్జస్టబుల్ ఫ్రంట్, రియర్ హెడ్‌రెస్ట్ వంటి సరికొత్త ఫీచర్లతో అప్‌డేట్ చేశారు. ఇక కార్ ఇంటీరియర్ విషయానికి వస్తే 60:40 స్ప్లిట్ వెనుక సీట్లు, వీటికి టూస్టెప్ రిక్లైన్ ఫంక్షన్ ఇచ్చారు. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు ప్రయాణికులకు భద్రత కల్పిస్తాయి. డే అండ్ నైట్ అడ్జస్టబుల్ ఇన్‌సైడ్ రియర్ వ్యూ మిర్రర్, ప్యాసింజర్లు అందరికీ త్రీ-పాయింట్ సీట్ బెల్ట్, ఈఎస్‌సీ, హిల్ స్టార్ట్ అసిస్ట్ కంట్రోల్ వంటి ఫీచర్లు కూడా ఉన్నాయి.ఇక ఇంజిన్ గురించి చెప్పుకోవాలంటే 'వెన్యూ ఈప్లస్' 1.2-లీటర్ ఎన్ఏ పెట్రోల్ ఇంజన్‌తో ఐదు-స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్‌తో వస్తుంది. ఇంజిన్ కాన్ఫిగరేషన్ విషయానికి వస్తే.. 82 బీహెచ్‌పీ, 114 ఎన్ఎం గరిష్ట టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. హ్యుందాయ్ వెన్యూలో ఇప్పటికే ఈ, ఎస్, ఎస్ ప్లస్, ఎస్ , ఎగ్జిక్యూటివ్, ఎస్ ప్లస్, ఎస్ఎక్స్, నైట్ ఎడిషన్, ఎస్ఎక్స్ వేరియంట్లు ఉన్నాయి. కొత్త ఈప్లస్ మోడల్ కావాలంటే 'వెన్యూ ఈ' వేరియంట్‌పై రూ. 29,000 అదనంగా ఖర్చవుతుంది.

# టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌కు కిక్కు!

### 18 శాతం జీఎస్టీ ఎత్తివేతకు ఆస్కారం

### ఈ నెల 9న జరిగే సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ: రాబోయే వస్తు, సేవల పన్ను మండలి (జీఎస్టీ కౌన్సిల్) సమావేశంలో టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలకు చెల్లించే ప్రీమియంలపై జీఎస్టీని ఎత్తివేసే అవకాశాలున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ పాలసీల ప్రీమియంలపై 18 శాతం జీఎస్టీ పడుతున్నది. ఈ నేపథ్యంలో ఎప్పట్నుంచో దీన్ని తొలగించాలని అటు పాలసీదారులు, ఇటు బీమా పరిశ్రమ వర్గాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. తమకు ఇది ఆర్థిక భారంగా ఉంటున్నదని పాలసీ హోల్డర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 9న జరిగే జీఎస్టీ మండలి సమావేశంలో ఈ అంశాన్ని పరిశీలించబోతున్నారని సమాచారం. దీంతో టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌ల ప్రీమియంలపై విధిస్తున్న 18 శాతం జీఎస్టీని తీసేసే వీలుందని భూటా షా అండ్ కో. ఎల్ఎల్‌పీ పార్ట్‌నర్ హర్ష భూటా చెప్తున్నారు.



**ఇదీ సంగతి..**

జీవిత బీమా రకాల్లో టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలదే ఇప్పుడు హవా. ఇతర ఏ మెచ్యూరిటీ ప్రయోజనాలు లేకుండా కేవలం డెత్ బెనిఫిట్ (పాలసీదారు మరణానంతరం వచ్చే ప్రయోజనం) మాత్రమే ఇందులో ఉంటుంది. తక్కువ ఖర్చుతో భారీ మొత్తాలను పాలసీదారులు అందుకునే అవకాశం వీటిలో ఉన్నది. అయితే పాలసీ వ్యవధిలో పాలసీదారుడు చనిపోతేనే బీమా ప్రయోజనం ఉంటుంది. లేకపోతే ఈ బీమాకు ఖర్చు చేసిన మొత్తాలను వదులుకోవాల్సిందే. గడువు దాటితో మళ్లీ కొత్త పాలసీ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రీమియంల ఆధారంగా పాలసీ ప్రయోజనాలుంటాయి. ఒకేసారి వేలు, లక్షలు చెల్లిస్తే కోట్లలో పరిహారం లభిస్తుంది. అయితే ఆకస్మిక మరణాలు సంభవించినప్పుడు బాధిత కుటుంబాలకు టర్మ్ ఇన్సూరెన్స్ అనేది కొండంత అండగా నిలుస్తున్నది. అందుకే ప్రీమియంలు ఎక్కువైనా వీటినే తీసుకొనేందుకు అంతా ఆసక్తి చూపిస్తున్నారు. కానీ ఈ ప్రీమియంలపై జీఎస్టీ 18 శాతం ఉండటంతో పాలసీదారులకు, పరిశ్రమకు కొంత ఇబ్బందికరంగా ఉంటున్నది. జీఎస్టీ మినహాయింపు దక్కితే పెద్ద ఎత్తున టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీల అమ్మకాలు జరుగుతాయని, అందరికీ బీమా అనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం కూడా త్వరగా నెరవేరుతుందని అంతా అంటున్నారు.ఇక టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను ఇతర లైఫ్ ఇన్సూరెన్స్‌ల తరహాలో పెట్టుబడి కోణంలో చూడవద్దని, కుటుంబ పెద్ద చనిపోతే.. ఆ కుటుంబం రోడ్డునపడకుండా టర్మ్ ఇన్సూరెన్స్ కాపాడుతుందని, వారి భవిష్యత్తు అవసరాలే తప్ప ఇందులో పాలసీదారులకు ఎలాంటి లాభాలకు తావు లేదన్న అభిప్రాయాలూ ఇండస్ట్రీ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. అందువల్లే జీఎస్టీ మినహాయింపు అంశాన్ని వచ్చే వారం సమావేశంలో కౌన్సిల్ పరిశీలించబోతున్నట్టు చెప్తున్నారు.

**ఇతర పాలసీలపై..**

యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు (యులిప్స్)గా ఉన్న ఇతర జీవిత బీమా పాలసీలపై జీఎస్టీ ఎత్తివేతకు వీలుండకపోవచ్చని కూడా అంటున్నారు. పాలసీదారుడు మరణించినా.. మరణించకపోయినా నిర్ణీత కాలవ్యవధి తర్వాత బీమా ప్రీమియంల సొమ్ము తిరిగి వస్తుందని గుర్తుచేస్తున్నారు. పాలసీదారులకు, వారి కుటుంబ సభ్యులకు బీమా ప్రతిఫలం అందుతుందని, కాబట్టి ఈ మనీ బ్యాక్ పాలసీలన్నింటినీ పెట్టుబడుల కోణంలోనే చూస్తారంటూ వాటిపై 18 శాతం జీఎస్టీ ఇకపైనా కొనసాగుతుందని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి.అయితే కొంత మొత్తంలో ఈ పన్ను భారాన్ని తగ్గించవచ్చని, మొత్తంగా మాత్రం తీసేయకపోవచ్చని మరికొందరు అంటున్నారు.

## అదానీ విల్మర్ నుంచి అదానీ గ్రూప్ ఔట్





### 10.42 శాతం వాటా విక్రయం

న్యూఢిల్లీ: ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్(గతంలో అదానీ విల్మర్)లో మిగిలిన 10.42 శాతం వాటాను ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా విక్రయించినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ తాజాగా పేర్కొంది. బీఎస్ఈ బ్లాక్‌డీల్ గణాంకాల ప్రకారం షేరుకి రూ. 275.5 ధరలో 13,54,82,400 షేర్లు అమ్మివేసింది. 11 లావాదేవీల ద్వారా దాదాపు రూ. 3,733 కోట్లకు 10.42 శాతం వాటా విక్రయించింది. వీటిలో ఢిల్లీ సంస్థ షాజాయిటన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎఫ్‌జెడ్‌సీవో 8.52 శాతం వాటాకు సమానమైన 11.07 కోట్ల ఈక్విటీ షేర్లను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 3,050 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. ఏడబ్ల్యూఎల్ అగ్రిలో షేర్లు కొనుగోలు చేసిన ఇతర సంస్థలలో క్వాంట్ ఎంఎఫ్, ఐడీఎఫ్‌సీ ఎంఎఫ్, బంధన్ ఎంఎఫ్‌తోపాటు.. జూపిటర్ ఫండ్ మేనేజ్‌మెంట్, మార్గాన్ స్టాన్లీ ఏషియా సింగపూర్ తదితరాలున్నాయి.

## ప్రపంచంలో రెండో స్థానానికి భారత్

అమెరికాను వెనక్కి నెట్టి భారత్ తొలిసారిగా ప్రపంచంలోనే రెండో అతిపెద్ద 5జీ మొబైల్ మార్కెట్‌గా అవతరించింది. గ్లోబల్‌గా 5జీ మొబైళ్ల వాడకంలో గతేడాదితో పోలిస్తే 2024 మొదటి అర్ధ భాగంలో 20 శాతం పెరిగిందని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ నివేదిక తెలిపింది. 5జీ ఫోన్లలో యాపిల్ మొబైళ్లను ఎక్కువగా వాడుతున్నారని పేర్కొంది.కౌంటర్ పాయింట్ రీసెర్చ్ నివేదిక ప్రకారం..ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా 5జీ మొబైళ్లు వాడుతున్న దేశాల్లో అమెరికా తర్వాత భారత్ రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు ఈ స్థానంలో ఉన్న చైనాను వెనక్కి నెట్టి భారత్ ఒక స్థానం ముందుకు చేరింది. 5జీ ఫోన్లలో ఎక్కువగా యాపిల్ మొబైళ్లను వాడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ కేటగిరీలో 25 శాతం కంటే ఎక్కువ వాటా యాపిల్ సొంతం చేసుకుంది. ఐఫోన్ 15, 14 సిరీస్‌ల్లో ఈ సాంకేతికతను ఎక్కువగా వాడుతున్నారు.బడ్జెట్ విభాగంలో ఎక్కువగా షావోమీ, వివో, శామ్‌సంగ్ ఇతర బ్రాండ్‌లకు చెందిన మొబైళ్లను వాడుతున్నారు.




# ఆరోగ్య బీమా తిరస్కరించకూడదంటే..

జీవనశైలిలో మార్పు, విభిన్న ఆహార అలవాట్లతో అనారోగ్యబారిన పడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఆరోగ్య బీమా ఉందనే ధీమాతో ఆసుపత్రిలో చేరిన కొందరి క్లెయిమ్‌లను కంపెనీలు తిరస్కరిస్తున్నాయి. అయితే బీమా తీసుకునే సమయంలోనే పాలసీదారులు చేస్తున్న కొన్ని పొరపాట్ల వల్ల ఇలా క్లెయిమ్ అందడం లేదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అసలు ఆరోగ్య బీమా క్లెయిమ్ ఎలాంటి పరిస్థితుల్లో తిరస్కరిస్తారు.. అలా కంపెనీలు క్లెయిమ్‌లు తిరస్కరించకూడదంటే ఏం చేయాలనే వివరాలు తెలుసుకుందాం. బీమా పాలసీ డాక్యుమెంట్లు గతంలో సామాన్యులకు అర్థంకాని కఠిన పదాలతో ఉండేవి. కానీ భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) పాలసీ పత్రాలు సరళమైన భాషలో ఉండాలని ఆదేశించింది. దాంతో ప్రస్తుతం అన్ని కంపెనీలు అందరికీ అర్థమయ్యే విధంగా పాలసీ పత్రాలను వెల్లడిస్తున్నాయి. అన్ని కంపెనీలు ఐఆర్‌డీఏఐ మార్గదర్శకాలకు అనుగుణంగా పాలసీ జారీ చేస్తుంటాయి. అయితే వాటిని సరిగా అర్థం చేసుకుని బీమా తీసుకోవాల్సి ఉంటుంది. అందులో ప్రధానంగా కింది అంశాలపై అవగాహన ఉండాలి. ఆరోగ్య సమాచారం సరిగా తెలపడం పాలసీ తీసుకునేప్పుడు ఆరోగ్య విషయాలు స్పష్టంగా తెలియజేయాలి. ఒకవేళ గతంలో ఏదైనా సర్జరీలు, అనారోగ్య సమస్యలుంటే తప్పకుండా కంపెనీలకు ముందుగానే చెప్పాలి. దానివల్ల స్వల్పంగా ప్రీమియం పెరుగుతుంది. కానీ భవిష్యత్తులో పాలసీ క్లెయిమ్ కాకపోతే ఇబ్బంది పడాల్సి ఉంటుంది. కాబట్టి ఎలాంటి సమస్యలున్నా ముందుగానే తెలియజేయడం ఉత్తమం.

**వెయిటింగ్ పీరియడ్**

పాలసీ తీసుకున్న వెంటనే కొన్ని రకాల జబ్బులకు కంపెనీలు వైద్య ఖర్చులు అందించవు. అలాంటి వ్యాధులకు బీమా వర్తించాలంటే కొన్ని రోజులు వేచి ఉండాలి. అయితే కంపెనీలకు బట్టి ఈ వ్యాధులు మారుతుంటాయి. మీకు ఇప్పటికే కొన్ని జబ్బులుండి వాటికి వైద్యం చేయించుకోవాలనుకుంటే మాత్రం అన్ని వివరాలు తెలుసుకోవాలి.

**సరైన ధ్రువపత్రాలతో రీయింబర్స్‌మెంట్**

బీమా కంపెనీలకు చెందిన నెట్‌వర్క్ ఆసుపత్రులు అందుబాటులో లేనివారు ఇతర హాస్పటల్‌లో వైద్యం చేయించుకుంటారు. తర్వాత బీమా కంపెనీకి బిల్లులు సమర్పించి తిరిగి డబ్బు పొందుతారు. అయితే అందుకు సరైన ధ్రువపత్రాలు అవసరం. వైద్యం పూర్తయ్యాక ఆసుపత్రి నుంచి అవసరమైన పత్రాలు, బిల్లులు, ఆరోగ్య నివేదికలు తీసుకొని నిబంధనల ప్రకారం రీయింబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలి.

